సంస్మరించుకుందాం

# కామ్రేడ్ ఖోకన్ మజుందార్‌కు విప్లవ జోహార్లు

**సిపిఐ(ఎం-ఎల్)** కేంద్రకమిటి సభ్యులు, మహత్తర నక్సల్బరి రైతాంగ ఉద్యమ నాయకులలో ఒకరైన కా॥ఖోకన్ మజుందార్ (86సం॥లు) 2017 మే 29న అమరులయ్యారు. ప్రస్తుత బంగ్లాదేశ్‌లోని బారిసాల్ జిల్లాలోని ఓ గ్రామంలో జన్మించిన అబ్దుల్ హమీద్ అనే బాలుడు, చిన్నవయసులోనే తల్లిదండ్రులిరువురిని కోల్పోయి, 14 ఏళ్ళ వయసులోనే కలకత్తా చేరుకున్నారు. అనేక విపత్తులు, కష్టాల అనంతరం, కోల్‌కతాలోని లేక్ హాస్పిటల్‌లో వార్డుబాయ్‌గా పనిచేస్తున్న దశలో కమ్యూనిస్టు పార్టీతో ఆయన సంబంధాలలోకి వచ్చారు. హాస్పిటల్ కార్మికుల పోరాటాలకు నాయకత్వం వహించినందుకుగాను ఆ సమయంలో ఆయనను అరెస్టు చేశారు. కా॥ ఖోకన్ మొదట ఆలీపూర్ సెంట్రల్ జైల్లోను, తర్వాత బెరహంపూర్ బాలల జైల్లోనూ 2 సం॥ల జైలు శిక్షననుభవించిన తర్వాత విడుదలైన వెనువెంటనే కోల్‌కతా తిరిగి వచ్చి 'పీపుల్స్ రిలీఫ్ కమిటి'లోని వైద్యులకు సహాయకునిగా పనిచేశారు. డా॥ రంజిత్ బోస్‌తో పరిచయాల్లోకి వచ్చిన తర్వాత భారత కమ్యూనిస్టు పార్టీలో ఆయన సభ్యత్వం పొందారు. 1954లో డార్జిలింగ్ జిల్లాకు ఆయన తిరిగి వచ్చారు. కామ్రేడ్స్ రతన్‌లాల్ బ్రహ్మన్ మరియు కా॥ చారుమజుందార్‌ల సలహాపై కా॥ ఖోకన్ మొదట కార్మికులను సంఘటితపరిచే కృషిచేస్తూ, రైతాంగాన్ని సమీకరించటంలో కా॥కానుసన్యాల్‌కు సహకరించేందుకు అక్కడి నుండి నక్జల్బరి ప్రాంతానికి పంపబడ్డారు.

సిలిగురి సబ్‌డివిజన్ పరిధిలోని నక్జల్బరి, ఖేరిబారి, ఫాన్సీదేవా ప్రాంతాలలో కార్మిక, రైతాంగ ఉద్యమాలు వెల్లువలా ముందుకొచ్చాయి. బినామీ భూముల సాధన కోసం ప్రారంభించిన పోరాటం, నూతన రూపాన్ని సంతరించుకున్నది. 1962 భారత - చైనా యుద్ధం సందర్భంగానూ, 1965 భారత పాకిస్థాన్ యుద్ధం సందర్భంగానూ ఈ కామ్రేడ్స్ అరెస్ట్ చేయబడ్డారు. కానీ విడుదలైన ప్రతిసారీ కామ్రేడ్స్ తిరిగివచ్చి రెట్టించిన ఉత్సాహంతో రైతాంగ, కార్మిక ఉద్యమాలను అభివృద్ధిచేయటానికే కృషిచేశారు. డార్జిలింగ్ జిల్లా నాయకత్వం సైద్ధాంతిక పోరాటాన్ని కొనసాగిస్తుండగా, నక్జల్బరీ ప్రాంతానికి చెందిన ఉద్యమ కార్యకర్తలైన కామ్రేడ్స్ కానుసన్యాల్, జంగల్ సంతాల్, ఖోకన్‌మజుందార్, కదమ్‌లాల్ మల్లిక్ మరియు కేశవ్ సర్కార్ వంటి కామ్రేడ్స్ ప్రజారాశులను విప్లవ పోరాటాలలోకి సంఘటితపరిచే ఆచరణాత్మక కృషిలో నిమగ్నమై వున్నారు. ఫలితం అందరి దృష్టిలో వున్నదే - 'భారతదేశంపై వసంతకాల మేఘగర్జన'గా పేర్కొనబడిన మహత్తర నక్జల్బరీ రైతాంగ తిరుగుబాటు. రివిజనిజం, నయా రివిజనిజంలకు వ్యతిరేకంగా వాటినుండి విభజన రేఖగా భారత విప్లవోద్యమ పంథాను మిరుమిట్లుగొలిపేలా నక్జల్బరీ ఉద్యమం ముందుకొచ్చింది.

నాటి నుండి నేటి వరకు విప్లవోద్యమంలో ఎన్నో ఒడిదుడుకులు, ఎన్నో ఐక్యతలు, చీలికలు ఎదురవుతూ వచ్చాయి. కామ్రేడ్ ఖోకన్ మజుందార్ - కొన్నిసార్లు జల్పాయిగురి - కూచ్‌బిహార్ ప్రాంతంలో, మరికొన్నిసార్లు జార్ఖండ్ ప్రాంతంలో పనిచేసినా, అన్నివేళలా తన నక్జల్బరీ మూలాలకు తిరిగివచ్చిన అవిశ్రాంత పోరాట నాయకునిగా కొనసాగారు.

ప్రజల ప్రయోజనాల కొరకు, పార్టీ ప్రయోజనాల కొరకు పనిచేయటమే కామ్రేడ్ ఖోకన్ మజుందార్ జీవితాశయం. కా॥ ఖోకన్ మజుందార్ మరణంతో భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమం తన సమర్థులైన సేనానులలో మరొకరిని కోల్పోయింది.

భారత కమ్యూనిస్టు ఉద్యమం కా॥ ఖోకన్ మజుందార్‌ను సదా జ్ఞాపకముంచుకుంటుంది. కా॥ ఖోకన్ మజుందార్‌కు విప్లవ జోహార్లు.

*****